క్లుప్తంగా

కాంగ్రెస్ కార్మిక విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: కాంగ్రెస్ కార్మిక విభాగం జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆదివారం ఇందిరాభవన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు బొల్లి శేఖర్, నాయకులు సుద్దాల కిరణ్, దొనకొండ దేవయ్య, నక్క రాజు, గంధం మొగిలి, దుబ్బ లక్ష్మణ్, బొల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ బోర్డు సభ్యుల నియామకం

రాయికల్: పట్టణంలోని హనుమాన్ ఆలయ బోర్డు సభ్యులుగా ఆరుగురిని నియమిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యులు దాసరి గంగాధర్, రాయిల్ల ప్రభాకర్, వొజ్జల రాజరెడ్డి, నోముల జ్యోతి, సందెల గణేశ్, కల్లెడ రాజు కలిసి, చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు.

ఎంజేఏ ఉపాధ్యక్షుడిగా శంకర్

ఎంజేఏ(మాల జర్నలిస్ట్స్ అసోసియేషన్) ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా రాయికల్ పట్టణానికి చెందిన కాయితి శంకర్ ఎన్నికయ్యారు. కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో ఆదివారం సంఘం ఉమ్మడి జిల్లా సమావేశం నిర్వహించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

చెన్నకేశవనాథ ఆలయ నూతన కమిటీ ఎన్నిక



శ్రీధర్

రాయికల్: పట్టణంలోని చెన్నకేశవనాథ ఆలయ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మచ్చ శ్రీధర్, ఉపాధ్యక్షుడిగా ఎనుగందుల శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మంతెన మహేందర్ రెడ్డి, కోశాధికారిగా సాంబారు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా సంకోజి అశోక్ ఎన్నికయ్యారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, మాజీ సర్పంచ్‌లు తురగ రాజరెడ్డి, మచ్చ నారాయణ, ఎద్దండి భూమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం నూతన కార్యవర్గం



రాంరెడ్డి

మల్యాల: రెడ్డి సంఘం మల్యాల మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బద్దం రాంరెడ్డి, ఉపాధ్యక్షులుగా నేరెళ్ల నర్సింహారెడ్డి, మిర్యాల శేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అల్లూరి రాజేశ్వర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ఇట్టిరెడ్డి అంజిరెడ్డి, గడ్డం నర్సింహారెడ్డి, కోశాధికారిగా సంత మోహన్ రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా నేరెళ్ల భూంరెడ్డి, దొంగ ఆనందరెడ్డి, సలహాదారులుగా ముత్యాల రాంలింగారెడ్డి, ముదుగంటి రాజు రెడ్డి, ముత్యాల నర్సింహారెడ్డి ఎన్నికయ్యారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న నాయకులు, యువకులు

కథలాపూర్: భూషణరావుపేటలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మొత్తం 35 మంది రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వారికి పండ్లు, జ్యూస్ అందించి, అభినందించారు. క్లబ్ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న వన కల్యాణం



కోరుట్ల టౌన్: పట్టణంలోని అతి పురాతన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి వన కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన కొత్త సురేశ్ వ్యవసాయ క్షేత్రంలో జరిపిన వేడుక జరిపారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

జిల్లా జడ్జి పూజలు..

కోరుట్ల రూరల్: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో జిల్లా జడ్జి ఎస్.నారాయణ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. ఈవో విక్రమ్ తదితరులున్నారు.

అభిమానానికి మించిన హోదా లేదు

- జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



కేక్ కట్ చేసి, మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, పక్కన ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, నాయకులు

జగిత్యాలటౌన్: అభిమానాన్ని మించిన హోదా లేదని, జీవితపు చివరి అంకం వరకు ప్రజలకు సేవలందిస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. తన 74వ జన్మదిన వేడుకలను ఆదివారం కాంగ్రెస్ శ్రేణులు జగిత్యాల పట్టణంలో ఘనంగా నిర్వహించాయి. ఉదయం ఆయన కుటుంబసభ్యులు, పార్టీ నాయకులతో కలిసి జంబిగద్దె ప్రాంతంలోని ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ధరూర్ క్యాంపులోని కోదండరామాలయంలో పూజలు చేశారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు భారీ క్రేన్ సహాయంతో జీవన్‌రెడ్డిని గజమాలతో సత్కరించారు. అనంతరం ఆయన 74 కిలోల కేక్ కట్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుతో ముందుకు సాగుతోందన్నారు. కాంగ్రెస్ నాయకులు, జీవన్‌రెడ్డి అభిమానులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నాయకులు కల్లెపెల్లి దుర్గయ్య, విజయలక్ష్మి, బండ శంకర్, గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, రఘువీర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి, లక్ష్మీపూర్ వేంకటేశ్వర స్వామి, చిన్నగట్టు ఆంజనేయ స్వామి, పొరండ్ల రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో పూజలు చేశారు.

రాయికల్: మండలంలోని వివిధ గ్రామాలతోపాటు పట్టణంలోని గాంధీచౌక్ వద్ద ఆదివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



దుబ్బరాజన్న ఆలయంలో వేడుకలు..



బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో..

పెగడపల్లి: ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పెగడపల్లి మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు తిరుపతి, కిషన్, ప్రశాంత్ తదితరులున్నారు.

సారంగాపూర్: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ సారంగాపూర్ మండల నాయకులు దుబ్బరాజన్న ఆలయంలో పూజలు జరిపి, కేక్ కట్ చేశారు. బీర్‌పూర్ నాయకులు శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, కేక్ కట్ చేశారు.

మేడిపల్లి: కాంగ్రెస్ మేడిపల్లి మండల నాయకులు ఆదివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భీమారం మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, వెంకట్రావుపేట మాజీ సర్పంచ్ అంగడి ఆనంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: రైతుబాంధవుడు ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంతడుపుల పుష్పలత అన్నారు. మల్లాపూర్ మండల కేంద్రంలో ఆయన జన్మదిన వేడుకలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, డైరెక్టర్ రాజం, ప్యాక్స్ డైరెక్టర్ పూండ్ర లక్ష్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'భూమానందం సేవలు మరువలేనివి'

- టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్



నివాళి అర్పిస్తున్న చైర్మన్ అనిల్, నాయకులు

కోరుట్ల: తెలంగాణ పద్మశాలీ సంఘం రాష్ట్ర సీనియర్ నాయకుడు, పోపా రాష్ట్ర ఉపాక్షుడు వాసం భూమానందం సేవలు మరువలేనివని బాల్కొండ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఎండీసీ) చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. భూమానందం రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా.. ఆదివారం ఆయన ఇంటికి చేరుకొని, చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో శంకర్ రెడ్డి, సీపీఐ నాయకుడు చెన్న విశ్వనాథం, నాయకులు బండ్ల రవికుమార్, అంబల్ల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మణిదీప్ వైద్య ఖర్చులకు రూ.10 వేలు



ఆర్థికసాయం అందిస్తున్న ఇన్నోవేటర్ వెల్ఫేర్ సభ్యులు

కోరుట్ల రూరల్: జోగిన్‌పెల్లికి చెందిన తేలు మణిదీప్ గత నెల విద్యుత్ ప్రమాదానికి గురై, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ కుటుంబ దీనస్థితిపై ‘సాక్షి’లో ప్రచురితమైన పుత్ర భిక్ష పెట్టండి అనే కథనానికి రాయికల్ పట్టణానికి చెందిన ఇన్నోవేటర్ వెల్ఫేర్ సభ్యులు స్పందించారు. ఆదివారం మణిదీప్ వైద్య ఖర్చుల కోసం రూ.10 వేలు అందించారు. సభ్యులు కాశిరెడ్డి మారుతి, సంజీవ్ రెడ్డి, అవినాశ్‌రెడ్డి, మహర్షి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి, గుండె వైద్య శిబిరాలు

కోరుట్ల: పట్టణంలోని మా ఐకేర్, ఆప్టికల్స్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల, కోరుట్ల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దీన్ని ఐఎంఏ జాతీయ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ వై.అనూప్‌రావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు పూదరి దత్తాగౌడ్ ప్రారంభించారు. 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, 52 మందిని కరీంనగర్ తరలించి, ఉచితంగా శస్త్రచికిత్స చేయిస్తామని పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఆకుల మల్లికార్జున్, చంద్రప్రకాశ్, సలీం ఫారుకీ తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం గుండె ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలువురికి ఈసీజీ, 2డీ-ఎకో పరీక్షలు జరిపారు. ప్రజలు ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. వైద్యుడు శ్రీకాంత్, నాయకులు శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చిన్నారెడ్డి, శేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లల చదువుకు ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న శివశంకర్

జగిత్యాలజోన్: ఇద్దరు అనాథ పిల్లల చదువుకు జగిత్యాలకు చెందిన సామాజిక సేవకుడు సూరజ్ శివశంకర్ ఆదివారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. వరంగల్ పట్టణంలోని గిర్మాజీపేట లక్ష్మీపురం వీధికి చెందిన తిరుపతమ్మ–రమేశ్ దంపతులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారు. వారి పిల్లలు అనాథలైన విషయం తెలుసుకున్న శివశంకర్ వరంగల్ వెళ్లి, నగదు అందించారు. పిల్లల చదువు పూర్తయ్యేవరకు సాయం చేస్తానని పేర్కొన్నాడు.





విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న రాధిక, వైస్ చైర్‌పర్సన్ రమాదేవి

రంగవల్లుల పోటీలు

జగిత్యాలటౌన్: ధరూర్ క్యాంపు శ్రీశక్తి గణపతి సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. స్థానిక మహిళలు రంగు రంగుల ముగ్గులు వేశారు. వారందరికీ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సతీమణి రాధిక బహుమతి ప్రదానం చేశారు. డాక్టర్ మైత్రిరెడ్డి తదితరులున్నారు.

రాయికల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రాయికల్ పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. విజేతలకు వెండి బహుమతులు అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గండ్ర రమాదేవి, సంఘం మండల అధ్యక్షుడు గంప ఆనందం, పట్టణ ప్రధాన కార్యదర్శి గరిపెల్లి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు జిల్లా లావణ్య, ప్రధాన కార్యదర్శి సిద్ధంశెట్టి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

రాయికల్: మండలంలోని కట్కాపూర్ ఆంజనేయస్వామి ఆలయ 20వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాల దర్శనం



కర్ణాటక దత్తాత్రేయస్వామి ఆలయం వద్ద అర్చకులు

కథలాపూర్: మండలంలోని ధూప దీప నైవేద్య అర్చకులు పుష్యమాసం సందర్భంగా పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్లారు. ఆదివారం కర్ణాటకలోని శ్రీ గంగాపూర్ దత్తాత్రేయ స్వామి, బీదర్ లక్ష్మీనృసింహస్వామి వార్లను దర్శించుకున్నట్లు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని పలు ఆలయాలను దర్శిస్తామన్నారు. అర్చకుల సంఘం మండల అధ్యక్షుడు ఓరుగంటి మాధవాచార్యులు, ప్రతినిధులు రవీందర్, నరేశ్ శర్మ, వామన్‌శర్మ, విశ్వనాథం, శరత్, పవన్ తదితరులున్నారు.

పద్మశాలీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సతీశ్



కోరుట్ల: పట్టణానికి చెందిన మార్త సతీశ్ తెలంగాణ పద్మశాలీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆదివారం రాష్ట్ర నాయకులు ఆయనకు నియామక పత్రం అందించారు. కోరుట్ల పట్టణానికి చెందిన పద్మశాలీ నాయకులు సతీశ్‌ను అభినందించారు.

పద్మశాలీ సంఘం కార్యవర్గం



రాయికల్: పద్మశాలీ సేవా సంఘం ఇటిక్యాల కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నా రు. అధ్యక్షుడిగా బోగ రాజు, ఉపాధ్యాక్షుడిగా గొల్లవత్తిని సాయి, కోశాధికారిగా సామల్ల మ హేశ్, కార్యదర్శిగా సామల్ల రాజు, సలహాదారులుగా బైరి గంగాధర్, బింగి మురళి, సామల్ల మధు, స్వర్గం రాజారాం, మచ్చ రాజు ఎన్నికయ్యారు.

34 ఏళ్లకు.. ఒక్కచోటకు



ఒక్కచోట చేరిన పూర్వ విద్యార్థులు

రాయికల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఓ ఫంక్షన్‌హాల్ వేదికైంది. 34 ఏళ్ల తర్వాత చిన్ననాటి మిత్రులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకొని, నవ్వుకున్నారు. పూర్వ విద్యార్థులు ఆనంద్, ప్రశాంత్, మనోహర్, గణేశ్, వినయ్ తదితరులున్నారు.

'విద్యుత్ తీగలు సరిచేశారు'

సాక్షి ఎఫెక్ట్



కథలాపూర్: మండలంలోని సిరికొండ శివారు నల్ల చెరువుకు వెళ్లే రోడ్డులో వేలాడుతున్న విద్యుత్ తీగలను ట్రాన్స్‌కో సిబ్బంది సరిచేశారు. ఆదివారం ‘సాక్షి’లో దీనిపై ఫొటోస్టోరీ ప్రచురితమైంది. స్పందించిన ట్రాన్స్‌కో ఏఈ దివాకర్‌రావు వైర్లను సరిచేసేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

విరిగిన విద్యుత్ స్తంభాలు

- వేలాడుతున్న తీగలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న జనం



సంగెం శివారులో విరిగిన స్తంభం



కల్లూర్ శివారులో చేతకందే ఎత్తులో వేలాడుతున్న తీగలు

కోరుట్ల రూరల్: మండలంలో విద్యుత్ సమస్యలు పెరిగిపోతున్నాయి. అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదని ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు. పొలాల్లో విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయి. చాలాచోట్ల స్తంభాలు విరిగిపోయాయి. ఇనుప స్తంభాలను అలాగే కొనసాగిస్తున్నారు. కొన్నిసార్లు తీగలు తెగిపడినా సిబ్బంది గమనించకపోవటం గ్రామాల్లో సర్వసాధారణంగా మారాయి. ఇలాంటి సమస్యలపై స్థానికులు, ప్రజాప్రతినిధులు అధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు..

పొలాల్లో చాలాచోట్ల ఎక్కువ దూరంలో స్తంభాలు వేయడం ద్వారా తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయి. మధ్యమధ్య స్తంభాలు వేసి వైర్ల ఎత్తు పెంచాలని అధికారులు, సిబ్బందికి విన్నవించినా ఎవరూ చొరవ చూపటం లేదని రైతులు పేర్కొంటున్నారు. చాలాచోట్ల విద్యుత్ స్తంభాలకు సపోర్ట్ తీగలు లేక వంగిపోతున్నాయి. అవి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

ఇనుప స్తంభాలు తొలగించేందుకు తీర్మానం

గ్రామాల్లో ఉన్న ఇనుప స్తంభాలు తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని పల్లె ప్రగతి గ్రామసభల్లో తీర్మానం చేసినా ఇప్పటికీ తొలగించలేదు. వర్షాకాలంలో కరెంటు షాక్ వస్తుందేమోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. వర్షాకాలం స్తంభాలను తాకవద్దని.. దూరంగా ఉండాలని హెచ్చరిస్తున్న విద్యుత్ అధికారులు.. ఇనుప స్తంభాలను తొలగించటంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆదాయం వచ్చే పనులపైనే శ్రద్ధ

విద్యుత్ అధికారులు కొత్తకనెక్షన్లు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త మీటర్లు ఏర్పాటు వంటి ఆదాయం వచ్చే పనులపై శ్రద్ధ చూపుతున్నారని, పాత స్తంభాలు, వేలాడుతున్న వైర్లను సరిచేయడాన్ని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యుత్ అధికారులు ప్రమాదాలు జరుగకముందే సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరుతున్నారు.

పట్టించుకుంటలేరు



విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయని ఏఈకి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం లేదు. ఎవరైనా అటు వైపు వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది స్తంభాలు సరిచేసి తీగల ఎత్తు పెంచాల్సి ఉంది.

– వనతడుపుల అంజయ్య, మాజీ సర్పంచ్, కల్లూర్

తీగలు వేలాడుతున్నాయి



మా పొలం మధ్య నుంచే కరెంట్ తీగలు వెళ్తున్నాయి. స్తంభాలు వంగి తీగలు తక్కువ ఎత్తులోనే వేలాడుతున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి చెబితే వచ్చి, చూసి వెళ్లారు. ఇప్పటివరకు తీగలను సరి చేయలేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది.

– ఎండీ.నిజాముద్దీన్, రైతు, కల్లూర్

'పెగడపల్లి'లో జోరుగా వరినాట్లు



వరి నాటు వేస్తున్న మహిళా కూలీలు

- మండలంలో 28 వేల ఎకరాల్లో యాసంగి సాగు అంచనా

పెగడపల్లి: మండల రైతులు ఈ యాసంగిలో వరి సాగువైపే మొగ్గు చూపుతున్నారు. వరికి పెరిగిన మద్దతు ధర, బోనస్‌తోపాటు ఎస్సారెస్పీ ఆయకట్టు నీరు వస్తుండటంతో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఆరుతడి పంటలు వేయాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నా పట్టించుకోవడం లేదు. నెల రోజుల క్రితమే చాలామంది నార్లు పోసుకోగా.. ప్రస్తుతం పెగడపల్లి మండలంలో నాట్లు జోరందుకున్నాయి. మొత్తం 23 గ్రామాలకు గానూ 21 గ్రామాలు ఆయకట్టు ప్రాంతంలో ఉన్నాయి. 32 వేల ఎకరాల భూముల్లో 28 వేల ఎకరాలు సాగుకు అనుకూలంగా ఉన్నాయి. వానాకాలం సీజన్‌లో 26 వేల ఎకరాల్లో వరి సాగవ్వగా ఈ యాసంగిలో 28 వేల ఎకరాల్లో పంట వేయనున్నారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు.

నిండిన చెరువులు, కుంటలు

గత వానాకాలంలో కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు నిండాయి. వీటికితోడు ఎస్సారెస్పీ నీళ్లు వస్తున్నాయన్న ధీమాతో రైతులు వరి పంటపై దృష్టి సారించారు. మండలంలోని వ్యవసాయ భూములు వరి సాగుకే అనుకూలమని వారు చెబుతున్నారు.

పని తక్కువ.. లాభం ఎక్కువ



వరి పంట సాగు చేస్తే పని తక్కువ.. లాభం ఎక్కువ వస్తుంది. అంతేకాకుండా ఇక్కడ వ్యవసాయ భూములు వరి సాగుకు అనుకూలంగా ఉన్నాయి. అధికారులు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేశారు. ఫలితంగా నీటి కొరత కూడా ఉండకపోవచ్చు.

– కాటం నర్సింహారెడ్డి, పెగడపల్లి

అవగాహన కల్పిస్తున్నాం



ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. నీటి కొరత, చీడపీడల ముప్పు ఉన్నందున నష్టపోవద్దని సూచిస్తున్నాం. అయినా, వరి వైపే వారు మొగ్గు చూపుతున్నారు. పంటల పండించడంలో ప్రభుత్వ నిబంధనలు లేకపోవడమూ ఇందుకు కారణం అవుతోంది.

– శ్రీకాంత్, వ్యవసాయాధికారి, పెగడపల్లి